మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ

పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి

ఇచ్చోడ, జనవరి 29 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాల నుంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వరకు రూ.2.80 లక్షలతో చేపడుతున్న మురుగు కాలువ నిర్మాణానికి సోమవారం ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లోక శిరీశ్ రెడ్డి, ఎంపీటీసీ నిమ్మల శివకుమార్ రెడ్డి, వార్డు సభ్యుడు సిరిసిల్ల భూమయ్య, నాయకుడు మైల మహేశ్, యువకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్, వీడీసీ చైర్మెన్

బోథ్, జనవరి 29 : కౌఠ (బీ) గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను సోమవారం సర్పంచ్ రాధిక, ఉపసర్పంచ్ సీహెచ్ రవీందర్, వీడీసీ అధ్యక్షుడు గాజుల సురేందర్, ఉపాధ్యక్షుడు ముడుపు భూమారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన 16 జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు మెండు శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, కిరణ్, వార్డు సభ్యులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

నార్నూర్, జనవరి 29 : విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి మనోజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 101మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఎనిమిది మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది సునీత, మాయ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీకాంబ్లే, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

ఉట్నూర్, జనవరి 29: ఏజెన్సీ ప్రాంతంలో సౌకర్యాలు మెరుగు పర్చాలని సమస్యల పరిష్కార కమిటీ తాత్కాలిక కన్వీనర్ భరత్ చౌహాన్ సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూగుప్తాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ మీదుగా మంచిర్యాల, కాగజ్‌నగర్‌కు రైల్వేలైన్, ఉన్నత విద్యకు అగ్రికల్చర్, డెంటల్, మెడికల్, వెటర్నిటీ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. తాగు, సాగునీటి కోసం ప్రాజెక్టులు నిర్మించాలని కోరారు. ఇక్కడ నాయకులు బానోత్ రామారావ్, నేతావత్ రాందాస్ ఉన్నారు.

తీరనున్న రవాణా కష్టాలు

- కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు
- రూ.1.70 కోట్లు మంజూరు

కొనసాగుతున్న కండ్రివాగు వంతెన నిర్మాణ పనులు

బోథ్, జనవరి 29 : బోథ్ సమీపంలోని కండ్రివాగుపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. లోలెవల్ వంతెనతో వాన కాలంలో 15 గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను కేసీఆర్ ప్రభుత్వం గుర్తించి రూ.1.70 కోట్లు ఎఫ్‌డీఆర్ నిధులు మంజూరు చేసింది. పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభించారు. దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన ఈ వంతెనను అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. బోథ్-నిగిని డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయినా కుంగిపోయిన వంతెన మూలంగా మర్లపెల్లి, నిగిని, కరత్వాడ, పట్నాపూర్, పాత కరత్వాడ, నక్కలవాడ, కొత్త పల్లె, లక్ష్మీపూర్, రేండ్లపల్లె, నేరేడుపల్లె, నేరేడుపల్లెగూడ, ఇస్కర్‌పల్లె, సుర్దాపూర్, బాబెర, చింతగూడ, గురుదేవ్‌నగర్, కంటెగాం, బాబెరతండా గ్రామాల ప్రజలతో పాటు కైలాస్‌టేకిడికి వెళ్లే భక్తులు, మహారాష్ట్రలోని షివిని ప్రాంత్రాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వం వంతెన కోసం నిధులు కేటాయించింది. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. వచ్చే వానకాలంలోగా పనులు పూర్తయ్యేలా చేపడుతున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే భారీ వర్షం కురిసిన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వానకాలంలో కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన (ఫైల్)

నాలుగు నెలల్లోగా వంతెన పనులు పూర్తి చేయిస్తాం...

కండ్రివాగు వంతెన నిర్మాణ పనులు నాలుగు నెలల్లోగా పూర్తి చేయిస్తాం. ఇప్పటికే ఫిల్లర్ల తవ్వకం పనులు నడుస్తున్నాయి. తవ్వకంలో బండరాళ్లు రావడంతో కొంత ఆలస్యం జరుగుతున్నది. దగ్గరుండి పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో వానకాలం లోపు వంతెనను పూర్తి చేయిస్తాం.

-సునీల్, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, బోథ్ సబ్ డివిజన్

నేటి నుంచి కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు

మాట్లాడుతున్న మండల వైద్యాధికారి నైనాథ

జైనథ్, జనవరి 29 : ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి నైనాథ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే నులిపురుగుల దినోత్సవం, విటమిన్ ఏ ప్రచారం, పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

నార్నూర్, జనవరి 29 : మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం నాగల్‌కొండ సర్పంచ్ జాదవ్ సునీత, నాయకులు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నార్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రహీమ్ పాషాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు జాదవ్ దత్త, షేక్ ఇనూస్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నర్సోజి

జాకీర్ ఖురోసి

ఎదులాపురం, జనవరి 29 : జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని సంఘ భవనంలో సోమవారం ఆరె కటిక అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నర్సోజి, ప్రధాన కార్యదర్శిగా జాకీర్ ఖురోసి, ఉపాధ్యక్షుడిగా మురార్‌కర్ సుభాష్, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ ఖలీల్, కోశాధికారిగా మసూద్ అహ్మద్, సభ్యులుగా షబీర్, నజీర్, సమీర్, రాజు, ఎం శ్రీను, సజ్జను ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పూలమాల వేసి శాలువాతో సన్మానించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

బోథ్, జనవరి 29 : సోనాలకు చెందిన సకర్వాల్ రాదేశ్యాం పది రోజుల క్రితం తన ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి రెండు రోజుల్లోనే ఫోన్ వెలికి తీసి సోమవారం ఎస్ఐ రాము యువకుడికి అందజేశారు. ఈ సందర్భంగా యువకుడు ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

క్షేత్రస్థాయి పంట పరిశీలన

కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 29 : ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జైనథ్, బేల మండలాల్లోని భోరజ్, తరోడా, నిరాల బేల్గామ్, సిర్సన్న, అవాల్‌పూర్ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న కంది, జొన్న, శనగ పంటల్లో క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మోహన్‌దాస్, శివ చరణ్ మాట్లాడుతూ యాసంగిలో కంది పూత, కాత దశలో ఉందన్నారు. ఈ దశలో ఆకు మూడత పురుగు, శనగ పచ్చ పరుగు, కాయ ఈగ గమనించామన్నారు. ఈ పురుగుల నివారణకు ఫ్లుబెండమైడ్ 40 మిల్లీ లీటర్లు లేదా నోవల్మూరాన్, ఇండాక్సాకార్బ్ 330 మిల్లీ లీటర్లు, లామ్డా సైహలోత్రిన్, క్లోరాంట్రానిలిప్రోల్ 80 మిల్లీ లీటర్లు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. శనగ పంటలో పెరుగుదల ఎండు తెగులు, ఆకు మచ్చల నివారణకు 19:19:19 రెండు కిలోలు, టెబుకొనజోల్, ట్రైఫ్లాక్సి స్ట్రోబిన్ 120 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ముందస్తు జాగ్రత్తగా ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

మాట్లాడుతున్న జెండార్ స్పెషలిస్ట్ కృష్ణవేణి

ఇచ్చోడ, జనవరి 29 : సిరికొండ మండలం ధర్మసాగర్ గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండార్ స్పెషలిస్ట్ కృష్ణవేణి మాట్లాడుతూ మహిళ హక్కులు, చట్టాలు, గృహ హింస చట్టం, హెల్ప్ లైన్ నంబర్ గురించి వివరించారు. సఖీ కేంద్రం సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెండార్ స్పెషలిస్ట్ కోటేశ్వర్, ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విమల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బ్రిడ్జి పూర్తయింది ..బస్సు వేయాలి

కరంజి వాగుపై నిర్మించిన బ్రిడ్జి

భీంపూర్, జనవరి 29 : భీంపూర్ మండలం కరంజి(టీ) నుంచి టేకిడిరాంపూర్ వాగుపై కేసీఆర్ ప్రభుత్వం రూ.2 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసింది. కరంజి నుంచి గుబిడి వరకు ఎనిమిది కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి మరో 6 కోట్లు అప్పుడు మంజూరు చేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం బ్రిడ్జి పూర్తయినందున తమకు ఆర్టీసీ వారు బస్సు వేయాలని గుబిడి, టేకిడిరాంపూర్, కొజ్జన్‌గూడ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

సీనియర్ నాయకుడికి టికెట్ ఇవ్వాలి

ఎదులాపురం, జనవరి 29 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా సీనియర్ నాయకుడికి టికెట్ ఇవ్వాలని ఆదివాసీ నాయకుడు, ఆల్ ఇండియా ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎంపీ టికెట్ కోసం జాతీయ నాయకులను కలిసి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎల్లుల సంతోష్ కుమార్, ఆదివాసీ మహిళా అధ్యక్షురాలు మెస్రం గంగాదేవి, బీసీ వడ్డెర సంఘం పట్టణ అధ్యక్షుడు అశోక్, వెల్మ సంఘం పట్టణ అధ్యక్షుడు సురేశ్, ఆదివాసీ పర్ధాన్ సమాజ్ పట్టణ అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షుడు ప్రదీప్ పాల్గొన్నారు.

పిల్లలు, వృద్ధులపై శ్రద్ధ తీసుకోవాలి

- 'నమస్తే కథనానికి' స్పందన
- అర్లి(టీ)లో వైద్య శిబిరం

భీంపూర్, జనవరి 29 : చలికాలం పిల్లలు, వృద్ధులపై కుటుంబీకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వైద్యసిబ్బంది పర్యవేక్షణ చేయాలని భీంపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సూచించారు. రాష్ట్రంలోనే అర్లి(టీ)లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన నేపథ్యంలో వైద్యశిబిరం ఆవశ్యకత గురించి 'నమస్తే తెలంగాణ'లో శుక్ర ,శని వారాలు కథనాలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి వైద్యాధికారి స్పందించి అర్లి(టీ)లో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 121 మందికి వివిధ పరీక్షలు చేశారు. పిల్లలు, వృద్ధులకు ప్రత్యేక పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఉన్ని దుస్తులు ధరించాలని సూచించారు. స్థానిక వెల్‌నెస్ సెంటర్ 24 గంటలు సేవలందిస్తుందన్నారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, సర్పంచ్ గొల్లి రమాబాయి, నాయకులు లస్మన్న, బొంత నితిన్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్లి(టీ)లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించాలి..

ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 29 : విద్యార్థులు ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో ఎల్టా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల లెవల్ స్పెషల్ విజార్డ్, డ్రామా పోటీల ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించగా.. మొదటి స్థానంలో మంజులా పూర్ ఉన్నత పాఠశాల, రెండో స్థానంలో కేజీబీవీ అనంతపేట్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పద్మ, ఎల్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్ర, వేణుగోపాల్, మండల ఇన్‌చార్జిలు ఆశ కిరణ్ పాల్గొన్నారు.

ఆరుతడి.. మంచి దిగుబడి

- 4535 ఎకరాల్లో పంటలు సాగు
- అత్యధికంగా 2100 ఎకరాల్లో జొన్న సాగు

తాంసి, జనవరి 29 : మండలంలోని గ్రామాల్లో యాసంగి సాగు తగ్గింది. ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. వానకాలంలో నాలుగెకరాలు సాగు చేస్తే ప్రస్తుతం ఎకరం నుంచి రెండెకరాలు మాత్రమే సాగు చేస్తున్నారు. దీనికి కారణం రైతులు వ్యవసాయ బావులపై ఆధారపడడం. మండలంలో ప్రస్తుతం 4,535 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. 2,100 ఎకరాల్లో జొన్న, 1,200 ఎకరాల్లో శనగ, 120 ఎకరాల్లో మొక్కజొన్న, 100 ఎకరాల్లో గోధుమ, 90 ఎకరాల్లో వేరుశనగ, 25 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వానకాలంతో పోలిస్తే సాగు విస్తీర్ణం 50 శాతానికి తగ్గిపోయింది. మండలంలోని మత్తడి వాగు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా వడ్డాడి, జామిడి, బండల్‌నాగపూర్, కప్పర్ల, పొచ్చర, జందాపూర్ రైతుల పంట పొలాలకు నీరు అందుతుంది. కుడి కాల్వ పనులు పూర్తయిన ఇంకా సాగు నీరు అందకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేసింది. అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని గ్రామాల చెరువులకు పెద్ద కాల్వలు తవ్వకపోవడంతో రైతులు బోరుబావుల కింద వ్యవసాయం చేస్తున్నారు. వేసవిలో భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోవడం, వడగండ్లు, ఈదురుగాలులతో నష్టం జరిగే అవకాశం ఉందని యాసంగి తక్కువ సాగు చేశారు. రైతులు 30 గజాల లోతు వరకు బావులు తవ్వుకున్నారు. 100 నుంచి 200 ఫీట్ల వరకు బోర్లు వేశారు. మండలంలో అధిక శాతం రైతులు వర్షాధార పంటలపైన ఆధారపడి సాగు చేస్తున్నారు.



పొన్నారిలో పండిస్తున్న శనగ పంట

మొక్కజొన్న వేశాను..

యాసంగిలో వరి వేస్తే పండదనే ఉద్దేశంతో మూడెకరాల వరకు మొక్కజొన్న వేశాను. వారిని కోసారి నీటి తడి సరిపోతుంది. అందుకే మొక్కజొన్న సాగు చేస్తున్నా. వానకాలంలో నాలుగెకరాలు సోయా వేశా. బోరుబావుల ఆధారంగా వ్యవసాయం చేస్తున్నాం.

- దేవల్ల గంగన్న, రైతు, బండల్ నాగపూర్

ఎండిపోయే ప్రమాదం ఉంది..

రెండెకరాల్లో వేరుశనగ, మినుములు, మొక్కజొన్న పంటలు వేశాను. మత్తడి వాగు కుడి పైపులైన్ కాలువతో నీళ్లు వస్తాయని మా గ్రామ రైతులందరూ ఎదురు చూశారు. ఇప్పటిదాకా ఒక చుక్క నీరు రాలేదు. మా ఇబ్బందులు తీరేదెప్పుడో తెలియని పరిస్థితి, వానకాలంలో పండినట్టు యాసంగిలో పంటలు పండే అవకాశం లేదు. వేసవిలో ఎండిపోయే ప్రమాదం ఉంది.

- అండె యాదగిరి, యువరైతు, పొన్నారి

వరి సాగు తగ్గింది..

సాగునీటి సౌకర్యం లేక గ్రామాల్లో వరిసాగు పూర్తిగా తగ్గింది. బావుల కింద వ్యవసాయం కాబట్టి మధ్యలోనే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. చాలా మంది రైతుల వ్యవసాయ భూములు బీడుగా మారాయి. అత్యధికంగా జొన్న, శనగ పంటలు సాగు చేస్తున్నారు.

- రవీందర్, మండల వ్యవసాయాధికారి, తాంసి

కొలాం గిరిజన కమిటీ ఎన్నిక

ఇంద్రవెల్లి, జనవరి 29: మండలంలోని మర్కాగూడలో కొలాం ఆదివాసీ గిరిజన సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కొడప భీంరావ్, ప్రధానకార్యదర్శిగా సిడాం తుకారాం, ఉపాధ్యక్షుడిగా కొడప లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శిగా ఆత్రం తుకారాం, సహాయకార్యదర్శిగా ఆత్రం రాజవేణు, కోశాధికారిగా టేకం భీంరావ్, సంస్కృతిక కార్యదర్శులుగా మడావి జంగు, కుమ్ర కొండురావ్, సమాచార కార్యదర్శులుగా మడావి రాజు, కుమ్ర రాజేశ్వర్, సలహాదారులుగా మడావి లేతు, కొడప ధర్మరావ్, మడావి భీంరావ్, మడావి సోనేరావ్, సభ్యులుగా మడావి కాంతబాయి, కుమ్ర బాపురావ్, హనుమంత్‌రావ్, జంగును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



మానిక్‌రావ్‌కు ఎన్నికల పత్రాన్ని అందజేస్తున్న కొలాం గిరిజనులు